యథేచ్ఛగా చెట్ల నరికివేత

కొయ్యలగూడెం: పొంగుటూరు పంచాయతీ పరిధిలో కన్నాయిగూడెం గ్రామంలో చెట్లు అక్రమంగా నరికి వేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఓవైపు వృక్షో రక్షితి రక్షితః వృక్షాలు ఉంటేనే భూమిపై జీవుల మనుగడ, అభివృద్ధి అంటూ ప్రభుత్వ ప్రచారం అమలులో మాత్రం కనిపించడం లేదన్నారు. అభివృద్ధి పేరిట నిర్మాణాల్లో భాగంగా వృక్షాలు భారీగా తొలగిస్తున్నా దొరికిందే తడవుగా అక్రమార్కులు అవసరం లేకున్నా వృక్షాలను నరికి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు గుప్పించారు. గతంలో కూడా ఆర్అండ్‌బీ అధికారులపై ఆరోపణలు వచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. కన్నాయిగూడెం గ్రామంలో ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న మూడు భారీ వృక్షాలు తొలగించడం ఇప్పుడు వివాదాస్పదమైంది. సంబంధిత అధికారులను సంప్రదించగా గత సంవత్సరం పంచాయతీ తీర్మానంతో అటవీశాఖ పర్మిషన్ ఇచ్చినట్టు ఆర్అండ్‌బీ ఏఈ వివరణ ఇచ్చారు.



కన్నాయిగూడెంలో నరికి వేసిన భారీ వృక్షం

ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పంచాయితీ సెక్రెటరీ తమ నోటీసులో లేదనడం గమనార్హం.

చెట్లు నరకడం ఆపాలి

చెట్లు జీవ వ్యవస్థకు ఆధారం, 30 ఏళ్ల వయసు ఉన్న ఈ చెట్లు నరకడం, పంచాయతీ అనుమతులు ఇవ్వడం అన్యాయం. భవిష్యత్తు తరాలకు ఆక్సిజన్ అందించాలంటే చెట్లు నరకడం ఆపాలి. చెట్లు నాటల్సిన పంచాయతీ తిరిగి చెట్లు నరకడానికి అనుమతులు మంజూరు చేయడం దారుణం. గ్రామంలో చాల సమస్యలు ఉన్నాయి. మళ్లీ ఈ చెట్లు నరకడం ఒక సమస్యగా మారింది. వీటిని వెంటనే ఆపాలి.

– కె.బాలాజీ, కన్నాయిగూడెం

పర్మిషన్ తీసుకున్న తరువాత అధికారులు నిర్దేశించిన గ్రేస్ పిరియడ్‌లో పని ముగించాలి కానీ ఏడాది దాటిన తరువాత అదీ వేసవికాలంలో ఈ చెట్లు నరకడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెట్ల తొలగింపు బాధాకరం

వేసవి కాలం వచ్చింది అంటే, చాలు ఉష్ణోగ్రత చాల ఎక్కువగా ఉంటుంది. ఉన్న ఈ చెట్లు కూడా తొలగించడం చాలా బాధాకరం. ప్రభుత్వాలు మారినప్పుడల్లా, వారికి వచ్చినట్టు తీర్మానాలు ఇవ్వడం పరిపాటి అయ్యింది. ఇదే కాకుండా రోడ్డు ఇరువైపులా ఆర్అండ్‌బీ రోడ్డు ఆక్రమించుకుని పొలాల్లో కలుపుకున్న అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. దీనిపై అధికారులు వెంటనే స్పందించాలి.

– జి.నాగేంద్ర, కన్నాయిగూడెం

చర్యలు తీసుకోవాలి

ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ప్రకృతిని కాపాడుకోవాలని ప్రచార ఆర్భాటం చేస్తున్న తరుణంలో అదే పార్టీ నాయకులు ఈ దుశ్చర్యలకు పాల్పడటం విస్మయానికి గురి చేస్తుంది. అసలే వేసవి తాకిడి 42 డిగ్రీలు నమోదు కావడం, సరిగ్గా వేసవి సమయంలో చెట్లు నరకడంతో గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు ఇలాంటి తప్పిదాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాను.

– వి సతీష్, గ్రామస్తుడు, కన్నాయిగూడెం

క్లుప్తంగా

ఘనంగా గండి పోశమ్మ ఉత్సవాలు



విశేష అలంకరణతో అమ్మవారు

కొయ్యలగూడెం: శ్రీగండి పోశమ్మ ఉత్సవాలు బుధవారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. పొంగుటూరు, కన్నాయిగూడెం గ్రామాల మధ్య కొలువైన అమ్మవారి ఆలయంలో ఉగాది అనంతరం ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారిని విశేష అలంకరణతో తీర్చిదిద్దారు. ప్రతిరోజూ సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ఉదయం సాయంత్రం వేళల్లో ప్రవచనాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

అంజన్న సన్నిధిలో దేవదాయ శాఖ మాజీ కమిషనర్



దేవదాయశాఖ మాజీ కమిషనర్‌కు వేదాశీర్వాదం అందిస్తున్న పండితులు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం తెల్ల మద్ది చెట్టు కింద స్వయంభువుగా వెలసిన శ్రీమద్ది ఆంజనేయ స్వామిని బుధవారం ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్, దేవదాయశాఖ పూర్వపు కమిషనరు ఎం.పద్మ స్వామివారిని దర్శించుకున్నారు. పర్యవేక్షకులు రంగారావు వారికి స్వామికి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. నిత్యాన్నదానానికి తాడేపల్లిగూడేనికి చెందిన గుత్తికొండ ప్రసన్నలక్ష్మి కౌసల్య రూ.1,00,001, దూబచర్లకు చెందిన వర్ధినీడి చిరంజీవి ధర్మతేజ రూ.22,500 విరాళంగా సమర్పించినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలి



టి.నరసాపురం: ఉద్యోగవిరమణ సభలో మాట్లాడుతున్న ఎస్సై ఎం.జయబాబు

టి.నరసాపురం: విధి నిర్వహణలో ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలని ఎస్సై ఎం.జయబాబు అన్నారు. బుధవారం ఏఎస్సై జయకుమార్ ఉద్యోగవిరమణ అభినందన కార్యక్రమం టి.నరసాపురం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జయబాబు మాట్లాడుతూ జయకుమార్ పోలీస్ శాఖలో తనకున్న అనుభవంతో ఎన్నో సమస్యలను కేసులు వరకు రాకుండా, ఇరువర్గాల వారిని సమన్వయం పరిచి, న్యాయం జరిగేలా చూశారన్నారు. జయకుమార్‌ను ఘనంగా సత్కరించారు. పోలీసులు పాల్గొన్నారు.

కార్యదర్శికి సన్మానం



ఉద్యోగ విరమణ చేసిన శివన్నారాయణ దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

కొయ్యలగూడెం: బయ్యనగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని అభివృద్ధి చేయడంలో కార్యదర్శిగా శివన్నారాయణ విశేషంగా కృషి చేశారని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. శివన్నారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు సన్మాన కార్యక్రమం దంపతులతో సహా నిర్వహించారు. బయ్యనగూడెం సొసైటీలోనే 25 ఏళ్లపాటు సేవలందించి సంఘ అభివృద్ధికి పాటు పడ్డారన్నారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు తోట జయబాబు, మధ్యాహ్నపు ఏసు, సీతంపేట గ్రామ సర్పంచ్ తోటకూర పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు టి.శ్రీనివాసరావు, భవిరిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బుట్టాయగూడెం: మండల కేంద్రమైన బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ద్వారా మంజూరైన నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను ప్రిన్సిపాల్ సంజీవని కుసుమ, కరాటం సాయి, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ కుసుమ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్‌లోనే కళాశాల తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. విద్యార్థులకు వైట్ లాంగ్ నోట్ పుస్తకాలు, రూల్డ్ లాంగ్ పుస్తకాలు 3306 చొప్పున మొత్తం 6,612 నోట్ పుస్తకాలు వచ్చాయన్నారు. అలాగే ఏప్రిల్ 7వ తేదీ నుంచి మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు కూడా అడ్మిషన్ పొందొచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

కామవరపుకోట: భూ సర్వేతో గ్రామాల్లో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. బుధవారం మండలంలో ఈస్ట్ యడవల్లి గ్రామంలో భూ సర్వేపై ఆమె అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమణ మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటి పరిష్కారానికి ఈ భూ సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులు సర్వే టీంలు కొలతలు వేసే రోజు పొలాలకు వెళ్లి తమ వద్ద ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలు, లింక్ డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ స్టాంపులు అధికారులకు చూపించాలన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి భూ సర్వేలు లేక రైతుల భూములు రికార్డులు లేక ప్రభుత్వ కార్యాలయాల



రీసర్వేపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో రమణ

చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడుతున్నారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరగా సర్వే పూర్తి చేస్తామని రైతులు సద్వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ గద్దం ఎలిసా, గ్రామ సర్పంచ్ పొన్నాల అనిత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

9 నుంచి అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 9 నుంచి గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. బుధవారం ఆలయంలో వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. 9వ తేదీ గణపతి పూజతో మొదలుకొని పుణ్యాహవాచనం, గోపూజ, అఖండ దీపారాధన, లక్ష్మీగణపతి, నవగ్రహ హోమం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పదో తేదీ విశేష చండీహోమం, మహన్యాస పూర్వక అష్టాభిషేకం, భస్మాభిషేకం, కనకాభిషేకం, అరట్టు, లక్షపుష్పార్చన, మధు నంబూద్రిచే మహా పడి పూజ నిర్వహిస్తారన్నారు. 11వ తేదీ అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తర నక్షత్రం సందర్భంగామమి వారి మూల విరాట్టుకు అన్నాభిషేకం, మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి గుర్వాయిగూడెంతో పాటు జంగారెడ్డిగూడెం



ఆలయ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించనున్నారన్నారు. 12వ తేదీ అఖండ అన్నసమారాధన నిర్వహిస్తారని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తమ్మన వెంకటేశ్వరరావు, గంగు జగన్‌మోహన్‌రెడ్డి, గుంట్ల వెంకటేశ్వరరావు, కొల్లిపర కృష్ణారావు, కోన పార్వతి, ప్రధాన అర్చకులు సుజిత్ కుమార్ పాండే, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

బొర్రంపాలెం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

టి.నరసాపురం: ఎంట్రప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఈఎండీపీ) 2024–25లో బొర్రంపాలెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థుల్లో వ్యాపార అభివృద్ధి లక్షణాలను అభివృద్ధి చేసే ఉద్దేశ్యంతో జిల్లా స్థాయిలో జిల్లా విద్యాశాఖ, ఈఎండీపీ, డిస్ట్రిక్ట్ సైన్స్ అధికారి, ఏఎంవో, అసిస్టెంట్ ప్రాజెక్టు కమిషనర్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఏలూరులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని బొర్రంపాలెం జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు మల్టీపర్పస్ సర్వింగ్ రోబో తయారు చేసి కార్యక్రమం ప్రదర్శించారు. ఇంటి వద్ద, పాఠశాలలో, కార్యాలయాల్లో ఈ రోబోను ఉపయోగించి పలు రకాల సేవలు పొం



ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థులు

దగలరని గైడ్ ఉపాధ్యాయురాలు జి.దీప ఐశ్వరీదేవి తెలిపారు. కార్యక్రమంలో మొత్తం 40 ఎగ్జిబిట్లు రాగా, వాటిలో అత్యుత్తమైన రెండు ప్రదర్శనలు ఎంపిక చేశారు. వాటిలో బొర్రంపాలెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రదర్శన రెండో స్థానంలో నిలిచిందని ఆమె తెలిపారు.

ముగిసిన నూకాలమ్మ వార్షిక జాతర

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ అమ్మవారి 61వ వార్షిక జాతర మహోత్సవం బుధవారం ముగిసింది. ఆలయంలో ఆఖరి రోజు మహాపూర్ణాహుతి, మహాన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రాజాన సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులు, ఆలయ కమిటీ పర్యవేక్షలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ యాగశాలలో ఆవాహిత దేవిదేవతల హోమములు, శ్రీ నూకాలమ్మ అమ్మవారి మూలమంత్ర హోమం, విశ్వశాంతి కొరకు మహా పూర్ణాహుతి ప్రధానార్చకులు యరమిల్లి మనోజ్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీ నూకాలమ్మవారికి పలు రకాల పిండి వంటలు మధుర పదార్థాలతో కూడిన కుంభ అన్న నివేదన చేసి, మహా అన్నసమారాధన



నూకాలమ్మ ఆలయంలో మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

నిర్వహించారు. సాయంత్రం అమ్మవా రు మాడ వీధుల్లో గ్రామోత్సవంచేశారు. కంద్రిక గూడెం శ్రీషిర్డీ సాయి భజన మండలి వారిచే సీతారామాంజనేయులు ఆధ్వర్యంలో భజన నిర్వహించారు.

ప్రచార ఆర్భాటంగా 'సోపానం'

కొయ్యలగూడెం: మండలం పరిధిలో బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రచార ఆర్భాటానికేనని పలువురు అభ్యర్థులు వాపోయారు. సౌకర్యాల లేమితో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే విధంగా రుణాల మంజూరు విషయంలో తీవ్ర అసంతృప్తితో వెనుదిరిగారు. ఇంటర్వ్యూలు ఎంపీడీవో కె.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బ్యాంకర్ల సమక్షంలో నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి పరింపూడి, గవరవరం, చొప్ప రామన్నగూడెం గ్రామాల అభ్యర్థులు 457 గాను 350 మంది మంగపతిదేవిపేట, కన్నాపురం గ్రామాలకు 159 గాను 95 దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి మంజూరైన 122 యూనిట్లకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు. అయితే అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో ఎంపీడీవో కార్యాలయం కిక్కిరిసిపోయింది. ఒక దశలో పరిస్థితిని అదుపు చేయడం కష్టంగా మారింది. ఈలోపు ఎమ్మెల్యే ఆఫీస్ నుంచి వచ్చిన తుది లిస్ట్ ప్రకారం మాత్రమే ఎంపిక ఉంటుందని తెలియడంతో కొంత మంది అభ్యర్థులు నిరాశతో వెళ్లిపోయారు.

సిఫార్సులతోనే రుణాల మంజూరు

గ్రామ స్థాయి అధ్యక్షుల నుంచి సిఫార్సు ఉండాలనీ వారికే రుణ సదుపాయం ఉంటుందని కూటమి నాయకులు ప్రచారం చేశారు. అధికారుల ప్రమేయం కంటే రాజకీయ నాయకుల సూచనలే ఎక్కువ ప్రభావం చూపిస్తున్నాయన్న ఆరోపణలు అభ్యర్థుల నుంచి వినిపిస్తున్నాయి.

3, 4 తేదీల్లో ఇంటర్వ్యూలు

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ పరిధిలో బీసీ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా స్వయం ఉపాధి పథకంలో దరఖాస్తు చేసుకున్న బీసీ, కాపు, ఈబీసీ, మేదర, కుమ్మర లబ్ధిదారులకు ఈ నెల 3, 4 తేదీల్లో మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కేవీ రమణ తెలిపారు. బీసీలకు సంబంధించి 3వ తేదీ, కాపులు, ఈబీసీ, మేదర, కుమ్మర్లకు 4వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సంబంధిత బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు.



కొయ్యలగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద కిక్కిరిసిన అభ్యర్థులు

నేడు ఇంటర్వ్యూలు

బుట్టాయగూడెం: మండలంలోని స్వయం ఉపాధి పథకంలో దరఖాస్తు చేసుకున్న వారికి నేడు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.జ్యోతి తెలిపారు. మండలంలో 176 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీరికి గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

పోలవరం రూరల్: స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని ఆయా బ్యాంక్‌లకు చెందిన బ్రాంచి మేనేజర్లు, అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఓసీ, బీసీ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్న 256 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మొత్తం 848 దరఖాస్తు చేసుకున్నారు. గురువారం కూడా ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

రైతాంగం పక్షాన కాంగ్రెస్ పోరాటం

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రజలు, రైతాంగం పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని పార్టీ ప్రాజెక్టు అధ్యయన కమిటీ వైస్ చైర్మన్ కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కమిటీ సభ్యులతో కలిసి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి పోలవరంలో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడిగా గుర్తించిన మహానేత, ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ఆయన హయాంలో 2004 నుంచి 2009 మధ్య ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం నుంచి తీసుకురావాల్సిన అన్ని అనుమతులు సాధించారన్నారు. జలయజ్ఞంలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 86 ప్రాజెక్టుల నిర్మాణాలు ప్రారంభించారని, వాటిలో ప్రధానమైన బహుళార్థక సాధక ప్రాజెక్టు పోలవరం అన్నారు. ముంపు గ్రామాల్లోని నిర్వాసితులను కలిసి, ప్రాజెక్టును పరిశీలించామని తెలిపారు. కమిటీ సభ్యులు రాజనాల రామ్మోహనరావు, విశ్వేశ్వర రెడ్డి, బండి విజయభాస్కర్, ఏసీసీ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి సుబ్బారావు, తోలేటి రఘుబాబు, చిలకా శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పోలవరంపై 'కూటమి' సాకులు

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో కూటమి ప్రభుత్వానివన్నీ సాకులని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాత బుధవారం మండలంలోని సీతారామనగరం ఉప్పేరు, చిరవెల్లి, కుక్కునూరు వరకు సాగింది. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంపై ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతుందని విమర్శించారు. ప్రాజెక్ట్ ఎత్తును ప్రకటించిన విధంగా 45.72 మీటర్ల వరకు నిర్మించాలన్నారు. ప్రాజెక్ట్ కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు పరిహారం విషయంలో అన్యాయం చేస్తే సహించమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన రవ్వవారిగూడెంలో నూతన పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి సుమారు రూ.32 లక్షల నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఏఈ డీఎన్‌వీడీ ప్రకాష్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన అలివేరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుసేవా కేంద్రం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. మరికొద్ది రోజుల్లో ఈ రెండు భవనాలు ప్రారంభించనున్నట్లు గిరిజన సంక్షేమశాఖ ఏఈ సత్యనారాయణ తెలిపారు. కాగా రూ.21లక్షల 50వేలతో రైతుభరోసా కేంద్రం, రూ.41లక్షల వ్యయంతో సచివాలయ భవనం నిర్మించారు.

నేడు సచివాలయం ప్రారంభం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. పరింపూడి పంచాయతీకి నూతనంగా నిర్మించిన సచివాలయ భవన ప్రారంభోత్సవం అదేవిధంగా రేపల్లెవాడలో నిర్మించిన భవన నిర్మాణ కార్మికుల నూతన భవనం ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్పంచ్ ముప్పిడి విజయకుమారి అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఇమ్మని రాజేశ్వరి హాజరవుతున్నారన్నారు.

పాస్టర్ మృతిపై విచారణ చేయాలి

పోలవరం రూరల్: పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ మృతిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని పోలవరం పాస్టర్స్ సభ్యులు డిమాండ్ చేశారు. రాజమండ్రి సమీపంలో అనుమానాస్పదంగా మృతిచెందిన ప్రవీణ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పాస్టర్ మృతిపై స్పెషల్ ర్యాపిడ్ టీంతో విచారణ చేయించాలన్నారు. పాస్టర్లు టీజే సుధా కర్, జయరాజు, సంపత్‌రావు, పరంజ్యోతి ఇ.క్రిస్టోఫర్, కె.బొలియర్ డేవిడ్, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు దరఖాస్తుల ఆహ్వానం

జంగారెడ్డిగూడెం: ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాలు పోస్టులకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవో పి.బ్యూల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం–7 (ఎస్సీ), గుర్వాయిగూడెం (జనరల్) కేటగిరిలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు జంగారెడ్డిగూడెం మండలంలో సుబ్బంపేట–1 (బీసీ–బీ), కేపీ గూడెం (జనరల్), వీరన్నగూడెం (ఈడబ్ల్యూఎస్), జంగారెడ్డిగూడెం–9 (ఎస్టీ), పట్టెన్నపాలెం –1 (జనరల్), కామవరపుకోట మండలంలో రావికంపాడు–1 (జనరల్), ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురం–2 (జనరల్), పంగిడిగూడెం–2 (జనరల్), తిమ్మాపురం–1 (బీసీ–సీ) కేటగిరీల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు స్థానికులైన వివాహిత మహిళలు, 21 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాన్నారు. అదనపు విద్యార్హతలకు ప్రాముఖ్యత ఉంటుంది. దివ్యాంగులైతే తక్కువ స్థాయి అంగవైకల్యం కలిగిన వారు మాత్రమే అర్హులు. అంధులైతే వేరొకరి సహాయం లేకుండా తమ పనులు తాము చేసుకోగలిగి, పిల్లల సంరక్షణ చూడగలిగిన వారై ఉండాలన్నారు. విద్యార్హత, నివాసం, కులం, పుట్టిన తేదీ, అంగవైకల్యం ఉంటే సదరం సర్టిఫికెట్, భర్త మరణిస్తే ధ్రువీకరణ పత్రం ఒరిజినల్స్‌తో పాటు, జిరాక్స్ కాపీలతో (గెజిటెడ్ అధికారి అటెస్టెడ్ చేయించినవి) ఏప్రిల్ 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

బుట్టాయగూడెంలో..

బుట్టాయగూడెం: మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఏలూరు తులసి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతిరామన్నపాలెం, పడమర రేగులకుంట, రామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో గిరిజనులతో మాత్రమే భర్తీ చేస్తామన్నారు. అలాగే అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు బుట్టాయగూడెం–4, బూసరాజుపల్లి, మర్లగూడెం, తూర్పురేగులకుంట, కె.అంకంపాలెం, లంకాలపల్లి, నాగన్నగూడెం, గోగుమిల్లి, పి. అంకంపాలెం–1, పూచికపాడు కేంద్రాల్లో పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు.

గోటి తలంబ్రాలతో భద్రాద్రికి పాదయాత్ర

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో భద్రాద్రికి 24వ మహా పాదయాత్రగా భక్తులు తరలి వెళ్లారు. జంగారెడ్డిగూడెం శ్రీసీతారామస్వామి దేవాలయం వద్ద సమితి అధ్యక్షుడు ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో మహాపాదయాత్ర ప్రారంభమైంది. యాత్రను చామర్తి శ్రీరాములు ప్రారంభించగా, శ్రీరామరథాన్ని తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామంజనేయ చౌదరి ప్రారంభించారు. ఆధ్యాత్మికవేత్త కేఎల్ఎస్ ధనకుమార్ మాట్లాడుతూ శ్రీరాముడికి కల్యాణ తలంబ్రాలు సమర్పించే నిమిత్తం భక్తితో 60 రోజుల నుంచి శ్రీరామ నామంతో గోటితో ఒలిచి తలంబ్రాలను తయారు చేశామన్నారు. సమితి అధ్యక్షుడు ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ మాట్లా



గోటి తలంబ్రాలతో పాదయాత్రగా వెళుతున్న భక్తులు

డుతూ 150 గ్రామాల నుంచి మూడు జిల్లాలు, రెండు రాష్ట్రాల భక్తులు గోటి తలంబ్రాలతో పాదయాత్రలో పాల్గొంటున్నారని 2వ తేదీ బుధవారం ప్రారంభమైన మహాపాదయాత్ర 5వ తేదీ భద్రాద్రికి చేరుకుని 6న జరిగే శ్రీరామనవమి కల్యాణానికి తలంబ్రాలు సమర్పిస్తామన్నారు.

మామిడి తోట వేలం వాయిదా

కుక్కునూరు: మండలంలోని పెద్దరావిగూడెం పంచాయతీ, వెంకటాపురం గ్రామంలోని సర్వే నెంబర్ 147లో గల మామిడితోట ఫలసాయం విషయమై బుధవారం ఏర్పాటు చేసిన వేలాన్ని అధికారులు వాయిదా వేశారు. మామిడి తోటకు వేలం నిర్వహించడాన్ని గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పోలవరం భూ సేకరణలో భూమికి మాత్రమే పరిహారం అందించారని చెట్లకు పరిహారం ఇవ్వలేదన్నారు. ఆదివాసీలు వేలంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

వేలం నిర్వహించే తేదీని ప్రకటిస్తాం

బుధవారం నిర్వహించాల్సిన వేలం గ్రామస్తుల అభ్యంతరాలతో వాయిదా వేస్తున్నట్టు ఉద్యానవన



ఉద్యానవన శాఖ అధికారిణికి వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

శాఖ అధికారిణి నవీన మణిమాల ప్రకటించారు. గ్రామస్తులు లేవనెత్తిన అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి వేలం తేదీని ప్రకటిస్తామన్నారు. అప్పటి వరకు మామిడి తోట ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందన్నారు.

ప్రపంచ సాహితీ సంబరాల కన్వీనర్‌గా పార్థసారథి

కొయ్యలగూడెం: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా మే నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు (శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాలు) ప్రోగ్రాం కన్వీనర్‌గా ఏలూరు జిల్లా కొయ్యలగూడేనికి చెందిన ప్రముఖ రచయిత, సాహితీ వేత్త డాక్టర్ టి.పార్థసారథి నియమితులయ్యారు. ఈ మేరకు శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ సీఈఓ కత్తిమండ ప్రతాప్ నుంచి నియామక ఉత్తర్వు లేఖను అందుకున్నారు.

రీసర్వేపై వినతి

ద్వారకాతిరుమల: తప్పులు తడకగా జరిగిన రీసర్వే కారణంగా తాము తీవ్రంగా నష్టపోతున్నామని, మళ్లీ రీసర్వే జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని వెంకటకృష్ణాపురానికి చెందిన పలువురు రైతులు బుధవారం తహసీల్దార్ జేవీ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు.

నేడు గ్రామసభలు

జంగారెడ్డిగూడెం: రీ–సర్వే సెకండ్ ఫేజ్‌కు సంబంధించి ఈ నెల 3వ తేదీన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కె.స్లీవజోజి ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ ఉదయం 10 గంటలకు గుర్వాయిగూడెం గ్రామానికి సంబంధించి గుర్వాయిగూడెం సచివాలయం వద్ద, మధ్యాహ్నం 12 గంటలకు మాతన్నగూడెం–2 గ్రామానికి సంబంధించి చక్రదేవరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. కావున ఆయా గ్రామాల రైతులు హాజరుకావాలని కోరారు.